


# తృష్ణ

నిడదవోలు మాలతి

తెలుగుకథ

ఆరోజు తపాల్ తెచ్చి, స్టాంపు వేసి, ట్రేలో పెట్టి వెళ్ళిపోయాడు బాలయ్యా.

తెలుగు లెక్చరర్ కమల ఎదురుగా కుర్చీలో ఉన్నారు. ఏవో పుస్తకాలు మా లైబ్రరీ లోనుంచి తీసి ఇవ్వమని అడగడానికి వచ్చారా విడ. బాలయ్యా తెచ్చిన ఉత్తరాలు చూస్తున్నాను నేను.


"మీకు వీడెక్కడ దొరికాడు?" అంది ఆవిడ, బాలయ్యా వెళ్ళినవేపు చూస్తూ.

"ఏం?" అన్నాను యధాలాపంగా.

బాలయ్యా ఇక్కడ చేరి నెలరోజులవుతోంది. నేను గమనించినంతవరకూ నాకు అతని పనిలో లోపం కనిపించలేదు.

"మీకు పనిచేస్తున్నాడా?" అని మరొక ప్రశ్న జోడించారావిడ మొదటిదానికి.

నేను జవాబు ఇవ్వలేదు. కొందరు మొదట్లో పనిచేస్తారు. తరవాత బద్ధకిస్తారు. కొందరు ఒకరికి పలుకుతారు. మరొకరిమీద తిరగబడతారు.



మళ్ళీ ఆవిడ అన్నారు. "వీడికి పన్నెండేళ్లొచ్చేవరకూ మా ఇంట్లోనే ఉండేవాడు" అని.

"మరి ఇప్పుడెందుకు లేడూ? " ఏదో ఒకటి అడగాలన్నట్టు అడిగాను.

"పొగరెక్కువైతే, మేమే పొమ్మన్నాం"

బాలయ్య మళ్ళీ ఏవో కాయితాలు తెచ్చాడు. రెండు కప్పులు కాఫీ తెమ్మని బాలయ్యకి డబ్బులిచ్చి కమలని స్టాక్‌రూంకి తీసుకెళ్లాను.

కమల పుస్తకాలు వెతుక్కోడం కన్నా, బాలయ్యని గురించి వివరించడంలోనే ఎక్కువ ఉత్సాహం చూపించింది. బాలయ్య వాళ్లింట్లో చేరినప్పుడు వాడికి ఎనిమిదేళ్లట. చాలా చురుగ్గా ఉండేవాడుట అప్పట్లో. నోట్లో మాట నోట్లో ఉండగానే చేతిలో పని అందుకునేవాడు. నాలుగేళ్ళ తరవాత వాడిలో మార్పు కనిపించింది. పనిదొంగ అయ్యాడు. పొద్దున్న ఏడున్నర అయ్యేసరికి ఎటో పోయేవాడు. పదకొండువరకూ కనిపిస్తూ, మాయమవుతూ, పనిచేసినట్టు కాకుండా, చేయనట్టు కాకుండా తప్పించుకు తిరిగేవాడు. మళ్ళీ మధ్యాహ్నం నాలుగు నించీ ఎనిమిదివరకూ అంతే. ఎక్కడికి వెళ్ళావంటే చెప్పడు. పనివేళ ఇంట్లో కనిపించకపోతే ఎలా అంటే మాటాడడు. మర్నాడు మళ్లీ మామూలే. కనిపించడు.

"ఆటలాడుకునే వయసే కాని, బాధ్యతలు మోసే వయసు కాదుకదా. చల్లని వేళల్లో ఏ బిళ్ళా కర్రో ఆడుకుని తీరినప్పుడు మీ పని చేసుకునేవాడు కాబోలు" అన్నాను.

"వాడికసలు పనంటే ఒళ్ళొంగదు" అంది కమల. నూరుగజాల దూరంలో ఉన్న కాలేజీకి, చేతిలో గొడుగూ, పక్కన తండ్రీ, వెనకాల పుస్తకాలు పుచ్చుకు నడిచే నౌకరూ మొదలుగా గల రాజలాంఛనాల్తో "రవి తేజములు" కాకపోయినా, పొండ్సుతో మెరిసిపడిపోయే మొహంతో వెడలి నడిచే కమల కాక మరెవ్వరు యోగ్యులు ఏ నౌకరు మనస్తత్వం ఏదో నిర్ణయించడానికి.

"మాకు సాయం ఉంటాడని పెట్టుకుంటే, మేమే వాడికి చేసిపెట్టవలసిన పరిస్థితి ఏర్పడింది. అందుకే పొమ్మన్నాం" అంది ఆవిడ.

పుస్తకాలు తీసుకుని మేం ఇద్దరం నారూంకి వచ్చేసరికి బాలయ్య కాఫీ రెండు కప్పుల్లో తీసుకొచ్చాడు. కమల ఎంచుకున్న పుస్తకాలు బాలయ్య చేతికిచ్చారు, నా పేరు మీద ఇస్యూ చేయించమని.

కమల కాఫీకి, పుస్తకాలకీ కృతజ్ఞతలు తెలియజేసి వెళ్ళిపోయింది. నాకు బాలయ్య ప్రవర్తనకంటే ఆలోచించవలసిన ముఖ్యమైన విషయాలుండడంచేత బాలయ్య గురించి నేను ఆలోచించలేదు. కాని అతను నా రూంలోకి వచ్చినప్పుడల్లా నేను గమనించకుండా ఉండలేకపోయాను. అదేదో అసంకల్ప ప్రతీకారచర్యలాగ, ఒక్కొక్కప్పుడు వాళ్ళ సెక్షనుకి వెళ్ళి ఏం చేస్తున్నాడో చూసేదాన్ని. ఒకరోజు పుస్తకం చదువుతూ కనిపించాడు.

"నిన్నిక్కడ వేసుకున్నది పుస్తకాలు చదవడానికి కాదు" అన్నాను కఠినంగా.

"సారీ, మేడమ్" అన్నాడు బాలయ్య తల వంచుకుని. నేను కొంచెం సౌమ్యంగా చెప్పి వుండవలసింది. ఆ తరువాత చాలామార్లు సెక్షనుకి వెళ్ళాను. కానీ బాలయ్యని చదువుతుండగా మళ్ళీ ఎప్పుడూ చూడలేదు.

ఇంతలో కొత్త గ్రాంట్లు రావడంతో పనెక్కువై బాలయ్య చదువుతున్నాడో, పాడుతున్నాడో పరిశీలించే అవకాశం నాకు లేకపోయింది మరో రెండు నెలలవరకూ.

★ ★ ★

"బాలయ్య సరిగా పనిచెయ్యడంలేదు మేడం" అని సెక్షను హెడ్డు నేరారోపణ చేశాడు ఒకరోజున.

"ఏమయింది? " అన్నాను.

"సెక్షనులో నిద్రపోతున్నాడు. లేపి అడిగితే 'రెండో ఆట సినిమాకి వెళ్ళాను. అంచేత నిద్ర వచ్చింది' అంటాడు"

బాలయ్యని నా దగ్గరికి పంపమని చెప్పి అతనిని పంపించేశాను. బాలయ్య వచ్చాడు.

"సెక్షనులో నిద్రపోతున్నమాట నిజమేనా?" సూటిగా ప్రశ్నించాను.

"ఒక్కసారే ఇలా తూలేనండీ" అన్నాడు.

"నువ్వు ఎలా తూలేవని నేను అడగడం లేదు. నువ్వు వరసగా మ్యాటినీ నుంచి మూడాటలు చూసినా నాకభ్యంతరం లేదు. కాని లైబ్రరీ అవర్సులో లైబ్రరీ పనే చెయ్యాలి" అన్నాను.

"నేను సినిమాకి వెళ్లలేదండీ" అన్నాడు బాలయ్య.

నాకు రవ్వంత చిరాకు కలిగింది. "నాకదంతా అనవసరం. మరొకసారి వర్కు సఫరయిందని తెలిస్తే నేను యాక్షను తీసుకోవలసి ఉంటుంది. వెళ్ళి పనిచూసుకో" అని చెప్పి పంపించేశాను.

బాలయ్య మాటాడకుండా వెళ్ళిపోయాడు. అతను నిజంగా సినిమాకి వెళ్ళలేదేమో అనిపించింది నాకు. సెక్షను హెడ్డు మాత్రం అతనిమీద నాకు అప్పుడప్పుడు చెబుతూనే ఉన్నాడు. నేను పిలిచి కసురుతూనే ఉన్నాను. నా దగ్గిర మాటాడడు. తన దగ్గిర పొగరుగా ఎదురు జవాబులు చెబుతున్నాడంటాడతను.

"నువ్వు మీ హెడ్‌కి పొగరుగా జవాబులు చెబుతున్నావుట- ఎందుచేత?" అని నేనెలా అడగను?

బాలయ్య తీవ్రమయిన తలనొప్పి అని సెలవు పెట్టాడు ఓరోజు.

"అది అబద్ధం మేడం. ఇవాళ కొత్త సినిమా మొదలు" అన్నాడు వాళ్ళ హెడ్.

"చూడండి, మిస్టర్ రామారావు, నిత్యశంకితుడు మొదలైన ఆరుగురు దుఃఖభాజనులని మనకి హితోపదేశం చెబుతూంది" అన్నాను.

"సర్లెండి మేడమ్" అనేసి అతను వెళ్ళిపోయాడు.

ఆ సాయంత్రం బజారులో సినిమాహాలు దగ్గిర రూపాయి టికెట్ క్యూలో చివర నిలబడిన బాలయ్యని నేను చూశాను. బాలయ్య నన్ను చూసి మొహం అటు తిప్పుకున్నాడు. నాకు బాలయ్యమీద నమ్మకం తగ్గింది.

★ ★ ★

మెడికల్ కాలేజీ హాస్టల్ వార్డెన్‌గా ఉన్న డాక్టర్ గోపాల్ ఒకరోజు నాతో మాట్లాడానికి వచ్చి బాలయ్యని చూసి "వీడో దొంగ" అన్నారు.

"ఇంకొంచెం వివరంగా చెప్పండి" అన్నాను నేను.

వస్తుతత్త్వం ఒకటే అయినా సూదికీ దబ్బనానికీ ఒకటే పేరు పెట్టలేంకదా.

"ఇక్కడేమీ పోలేదా?" అని ప్రశ్నించారాయన.

"నాకు తెలిసినంతవరకూ లేద"న్నాను.

"పనెలా చేస్తున్నాడు?"

ఈ శల్యపరీక్ష నాకు నచ్చలేదు. నిజానికి అతిస్వల్పమైన విషయాలు వదిలేస్తే, బాలయ్యలో ఎంచదగిన దోషాలు లేవు. చెప్పిన పని, చెయ్యననిగాని తనపని కాదని గానీ ఎప్పుడూ విర్రవీగలేదు. ఎవరైనా, ఏమైనా చిన్న చిన్న పన్లు చెప్తే చిల్లర డబ్బులకి చేతులు చాచిన దాఖలాల్లేవు.

"ఇంతకీ మీకెలా తెలుసు ఇతడు?" అని నేనే అడిగాను.

బాలయ్య ఈ ఆఫీసుకి రాకముందు వాళ్ళ హాస్టల్లో పనిచేశాట్ట. కూరలు తరగడం, వడ్డించడంవంటి పనులకి కుదిరాడట కాని కొద్ది దినాల్లోనే దొంగతనం చేస్తున్నట్టు ముందు అనుమానం కలిగి, తరవాత ప్రత్యక్ష సాక్ష్యాలతో రుజువై ఉద్యోగంనుండి తొలగింపబడ్డాడు. బాలయ్య బియ్యం దొంగతనం చేసినట్టు చూశాం అని చెప్పినవాళ్ళని ఆయన కళ్లారా చూశారట!

బాలయ్య ఆ బియ్యం ఏం చేసి ఉండేవాడో, అంతకుముందు ఏవేం దొంగతనం చేశాడో, అవేం చేశాడో తెలియలేదు. నేను మాత్రం ఈ విషయం ప్రిన్సిపాల్‌గారితో ప్రస్తావించి, అతడిని లైబ్రరీనించి మార్పించాలనుకున్నాను. కాని ప్రిన్సిపాల్‌గారు ఒప్పుకో

లేదు.

"లైబ్రరీలో బియ్యం లేవు కదండీ" అన్నారాయన.

వాడు పుస్తకాలు దొంగిలించదలుచుకుంటే, మరొక డిపార్టుమెంటులో ఉంటే మాత్రం చెయ్యలేడా? అని వితర్కించారు. అంతేగాక దొంగకి బాధ్యత అప్పజెప్పడంలో గొప్ప స్వారస్యం ఉందని నాకు బుద్ధి చెప్పారు. నాకు విసుగేసి ఊరుకున్నాను.

కాని బాలయ్యని కనిపెట్టి చూడమని మాత్రం అసిస్టెంటుకి చెప్పలేదు.

అతన్ని మార్చి నారూం దగ్గిర వేసుకున్నాను. నేను ఏపని చెప్పినా వెంటనే చేసేవాడు. ఒక్కొక్కమారు నాకు ఆశ్చర్యం వేసేది అతడు సాధించగల ఘనకార్యాలు చూస్తే. ఊళ్లో ఒక్క చుక్క కిరసనాయిలు దొరకడం లేదని, పెద్ద డాక్టరు, సబ్ జడ్జి తమకున్న పరపతినంతా వినియోగించి తంటాలు పడుతున్న రోజుల్లో బాలయ్య ఫుల్ టిన్ తెచ్చి ఇంట్లో పెట్టాడు.

పంచదార, బియ్యం, రైళ్లల్లో రిజర్వేషన్లు, తాలూకా ఆఫీసులో పెర్మిట్లు- ఏవైనా నిమిషాలమీద సాధించుకొచ్చేవాడు. కాని నా దగ్గరకి ఏ పుస్తకంకోసమో వచ్చే పురప్రముఖుల ద్వారా నేను విన్నవి మాత్రం ఏమంత ఆనందదాయకాలు కావు.

"పనంటే నిర్లక్ష్యం వాడికి" అన్నారొకరు.

"దొంగవెధవ" అని మరొకరు సర్టిఫై చేశారు.

"ఒంటిపక్షి. సత్రం భోజనం, మఠం నిద్రాను. డబ్బు విషయం జాగ్రత్త" అని వేరొకరు హెచ్చరించారు.

"చాలా వినయంగా ఉంటాడు" అని నేనంటే, "కారణం లేక నూకలు చల్లబడవు గదా" అని పాత కథ జ్ఞప్తికి తెచ్చారు.

ఒక్కటి మాత్రం నిజం. బాలయ్య నా దగ్గిర ఎప్పుడూ ప్రతిఫలం ఆశించలేదు సరికదా, నేనివ్వబోయినా పుచ్చుకోలేదు.

★ ★ ★

ఎండాకాలం శలవులు ప్రారంభమయ్యాయి. పిల్లలంతా ఇళ్ళకి వెళ్ళిపోయారు. నేను కాలేజీకి వచ్చి రెండేళ్లవుతోంది. ఇంతవరకూ స్టాక్ వెరిఫికేషను చెయ్యలేదు. ఇప్పుడు చెయ్యమని స్టాఫ్‌తో చెప్పి, దానికి కావలసిన ఏర్పాట్లు చేసి, మా వూరికి వెళ్ళిపోయాను, పదిహేను రోజులు సెలవు పెట్టి.

తిరిగి వచ్చేసరికి బాలయ్య సస్పెన్షనులో ఉన్నాడని తెలిసింది.

"ఎందుచేత?" అన్నాను తెల్లబోయి.

వెరిఫికేషను పూర్తి అయింది. ఇరవై ఐదు పుస్తకాలు కనిపించడంలేదు. నేను వచ్చి రిపోర్టు సబ్మిట్ చేసేవరకు బాలయ్యని ఆఫీసుకి రావొద్దని ప్రిన్స్‌పాలుగారు ఆదేశించారు.

---

✦ "మీ కొత్త సినిమా ఎలా నడుస్తోంది?" అడిగాడు ఓ మిత్రుడు.

"బాగానే ఆడుతోంది" జవాబిచ్చాడు నిర్మాత.

మరో మూడు, నాలుగు రోజుల తరువాత "మీ కొత్త సినిమా ఎలా నడుస్తోంది?" మళ్లీ అడిగాడు మిత్రుడు.

"ఏదోలే! ఆడుతోంది"

ఓ వారం రోజుల తరువాత మిత్రుడు మళ్లీ అదే ప్రశ్నవేశాడు.

ఈసారి నిర్మాత దీర్ఘంగా నిట్టూర్చి "వారం రోజులుగా ఆడీ ఆడీ నడిచీన డిచీ అలసిపోయి అడ్రస్సు లేకుండా వెళ్లి పోయిందిలెండి" అన్నాడు.



నేను తిరిగి వచ్చిన తరవాత బాలయ్య నాకు ఇంటిదగ్గిర కానీ, ఆఫీసు దగ్గిర కానీ కనిపించలేదు. ఒకళ్లిద్దరు ప్యూన్లను పిలిచి బాలయ్య ఎక్కడ ఉన్నాడో చూసి తీసుకుర మ్మన్నాను. వాళ్లు తెలీదన్నారు. ఈమధ్య ఎక్కడా కనిపించలేదుట.

బాలయ్య 25 పుస్తకాలు దొంగిలించాడంటే నమ్మలేకపోయాను. కాని అతడే కనిపించ కుండా పోయినప్పుడు నేనేం చెయ్యగలను?

నా విధి ప్రకారం పోయాయనుకున్న పుస్త కాల లిస్టు తీసుకుని మళ్ళీ జాగ్రత్తగా వెతికిం చాను. పది పుస్తకాలు కనుక్కోగలిగాం. అవి కాక ప్రిన్స్‌పాల్‌గారు, కాలేజీ కరెస్పాం డెంటూ, కమిటీ మెంబర్లూ, 'ఫలానా పుస్తకం పంపించమ'ని చిన్న చిన్న కాగితపు ముక్క లమీద రాసి పంపిన అనామత్ లెక్కలలో మరో ఎనిమిది తేలాయి. అందులో నాలుగే ళ్లుగా వాళ్ళ దగ్గిరే ఉండిపోయినవి ఉన్నాయి. అవన్నీ తేలేసరికి మరో రెండు వారాలు గడిచిపోయాయి.

బాలయ్య మాత్రం అయిపు లేడు. నా రిపోర్టు రాసి ప్రిన్స్‌పాల్‌గారి సముఖానికి సమర్పించుకున్నాను. ఏడు పుస్తకాల జాడ తెలియడంలేదు. కాలేజీ కమిటీవారు బాల య్యమీద పోలీసు రిపోర్టు ఇవ్వడానికి నిర్ణ యించారని తెలిసినప్పుడు నా గుండె కలు క్కుమంది. ఆ కమిటీలో లైబ్రరీ పుస్తకాలు తీసుకుని, సంవత్సరాల తరబడి తిరిగి ఇవ్వ నివాళ్లున్నారు. నేనూ, బాలయ్యా చేరక ముందు స్టాక్ వెరిఫికేషను చేసి ఎన్నేళ్ల యిందో తెలీదు. కాని ఇటువంటి ఆలోచనా విధానం ఆఫీసర్ల ఆరోగ్యానికి మంచిది కాదు.

పోలీసు రిపోర్టు ఇచ్చారు. పోలీసులు బాలయ్య నివసించే పాక కనుక్కున్నారు. అది ఆరుమైళ్ల దూరంలో ఉన్న చిన్న పల్లెలో ఒక మారుమూల ఉంది. సబిన్స్పెక్టరు నన్నూ, ప్రిన్స్‌పాల్‌నీ అక్కడికి తీసుకెళ్లారు మా వస్తువులు గుర్తించడానికి.

ద్వారం దగ్గిర చేరవేసి ఉన్న తడిక ఒక్క తోపుతో పడిపోయింది. ఆ చుట్టు గుడిసెలో కనిపించిన వస్తువులు చాలా తక్కువ.

వదులుగా కట్టిన తాడుమీద ఓ పాత లుంగీ, ఒక షర్టూ, ఒక పాంటూ వేలాడుతు న్నాయి. ఒకమూల వారగా ఒక మట్టికూజా, జర్మన్ సిల్వర్ గ్లాసూ ఉన్నాయి. తలుపుకి ఓ పక్కగా కొన్ని పుస్తకాలు, ఒక కిరసనా యిలు దీపం, ఒక పెన్నూ ఉన్నాయి.

"ఆ బుక్సు చూడండి" అన్నాడు యస్.ఐ.

నాకు ఎందుకో గొంతులో చేదుగా ఉంది. యసై ప్రిన్సిపాల్‌గారికి వివరిస్తున్నారు. తన సర్వీసులో ఇలాంటి వ్యాపారాలు చేసేవారిని ఎంతమందిని చూశారో ఎలా కనిపెట్టారో.

నేను ఒక్కొక్క పుస్తకం తీసి చూస్తు న్నాను. వార్ ఎండ్ పీస్, క్రైం ఎండ్ పని ష్మెంట్, కృష్ణపక్షం, గొన్నారెడ్డి, అల్లోనేరేడు, కృష్ణాతీరం బాలయ్య ఈ పుస్తకాలు ఎలా సేకరించినా, అన్నీ మంచివే చేసినందుకు అతని అభిరుచిని మెచ్చుకోకుండా ఉండలేక పోయాను. నాకు రిలీఫ్ ఇచ్చిన మరొక విషయం అవేవీ మా లైబ్రరీవి కాకపోవడం. వాటిపక్కనే ఉన్న నోటుబుక్కు తీశాను. అందులో తెలుగులోనూ, ఇంగ్లీషులోనూ ఉన్నాయి. వివిధ గ్రంథాలలోంచి తీసి రాసు కున్న సుభాషితాలు:

"అయిదురేకుల దీపకళిక నార్ప జూచెదరె వరు?

తారకా నవతైలబిందువులార నిచ్చునె

బ్రతుకుదివ్వెను? "

"వ్రాత వ్రాసెడు హస్తమ్ము వ్రాసి
కదలి వ్రాయుచును పోవుచుండ
ఆ వ్రాతలోని పంక్తి సగమైన
మరి రద్దు పరచలేవు"

"కన్నె ఎవరో చనిపోయి,
మన్నుకాగ
పూచినది సుమ్ము
ఆ మల్లెపూవు సొగసు!"

అవి చూస్తున్నాకొద్దీ నాకు సంభ్రమం కల గసాగింది. బాలయ్య ఇంతటి సాహితీప

రుడా? ఇవి బాలయ్యవేనా?

"యస్ మేడమ్" యస్సై అన్నారు నన్ను ద్దేశించి.

"ఆఁ" అంటూ ఆ నోట్ బుక్ వదిలేసి మరొక పుస్తకం తీశాను. అది వేయిపడగలు. లోపలి పేజీ తీశాను.

కళ్లు చెదిరినట్టనిపించింది. మా కాలేజీ స్టాంపు దానిమీద ఉంది. దాన్ని అరువుగా తెచ్చిన గుర్తులేమీ లేవు. కొంత భాగం చదివిన గుర్తుగా ఒక కాగితపు ముక్క ఉంది ఒకచోట.

"ఇదొక్కటే మా లైబ్రరీది" అన్నాను అక్కడ్నుంచి లేస్తూ.

ఏది జరక్కుండా ఉంటే బాగుణ్ణు అనుకున్నానో అదే జరిగింది. నా మనసు చికాకుగా ఉంది. ఆ చుట్టుపక్కల ఎక్కడో పందిని పట్టుకుంటున్నారు కాబోలు అది హృదయవిదారకంగా అరుస్తోంది.

"ఈ పరిసరాలు నేను భరించలేను. త్వరగా ఇక్కడ్నుంచి వెళ్ళిపోదాం" అన్నాను ప్రిన్సిపాల్ గారితో.

★ ★ ★

ఇంటికొచ్చిన తరవాత రెండు మూడు రోజులవరకూ ఏ పనీ చెయ్యలేకపోయాను. ఆలోచిస్తున్నకొద్దీ నాకు మరొక విషయం తట్టసాగింది. ఒకటి రెండుసార్లు నేను కావాలనుకున్న పుస్తకాలు షెల్ఫులోనూ లేవు, లోనులోనూ లేవు. అప్పుడు ఎంత వెతికినా దొరకనివి ఆ తరవాత దొరికేవి. అవి మళ్ళీ ఎలా వచ్చాయంటే ఎవరూ సరైన సమాధానం ఇవ్వలేదు. ఆ పుస్తకాల్లోని వాక్యాలు బాలయ్య నోట్సులో ఉన్నాయి. మరొక విచిత్రం పోయాయనుకుంటున్న పుస్తకాలు లిస్టులో వేయిపడగలు లేదు. అయితే బాలయ్య పుస్తకాలు దొంగతనంగా తీసుకెళ్ళి, చదివి, మళ్ళీ అక్కడ పెట్టేస్తుండాలి. నమ్మ దగ్గదిగా లేదు. కాగా బాలయ్య అంతటి చదువరీ, సంస్కారీనా? అని మరొక ప్రశ్న.

బాలయ్య పోలీసులకి దొరకలేదు. కాలేజి కమిటీవారు బాలయ్యే అన్ని పుస్తకాలూ దొంగలించినట్టు నిర్ణయించి, అతడికి ఆ నెలలో ఇవ్వవలసిన జీతం పట్టుకునేట్టు, ఉద్యోగంలోంచి బర్తరఫ్ చేసినట్టు ఉత్తర్వు జారీచేశారు.

అతని దగ్గిరున్న పుస్తకాలూ, రాసుకున్న సుభాషితాలు జ్ఞాపకం వచ్చినప్పుడు అనిపించేది తగిన అవకాశం, సవ్యమైన గురువూ ఉంటే బాలయ్య పండితుడై ఉండేవాడేమోనని.

★ ★ ★

బాలయ్య చరిత్రలో కలిసిపోయాడనే అనుకున్నాను. మూడేళ్ళనాడు మద్రాసులో మూర్మార్కెట్లో కొన్ని అలభ్యగ్రంథాలు వెతుకుతున్న నాకు బాలయ్య కనిపించేవరకూ.

అతడే నన్ను ముందు గుర్తు పట్టి ఇంగ్లీషూ, తెలుగూ కాని ఒక మధ్యస్థమైన పద్ధతిలో చేయెత్తి "నమస్తే మేడమ్" అన్నాడు.

ఏనాడో తప్పిపోయిన తమ్ముడు దొరికినంత సంతోషం కలిగింది నాకు. క్షణం పాటు ఏం మాటాడడానికీ తోచలేదు.

"బాగున్నావా? " అన్నాను.

"బాగున్నానండీ" అన్నాడు బాలయ్య. అల్లంత దూరంలో ఉన్న సెకండ్ హాండ్ బుక్‌షాపు చూపించాడు తనదేనని.

నా సంతోషం చల్లబడిపోయింది. ఆనాడు సబిన్స్పెక్టరు అన్నమాట జ్ఞాపకం వచ్చింది.

"రండి మేడం. నా షాపు చూడండి" అంటూ ఉత్సాహంగా పిలుస్తున్నాడు బాలయ్య.

ఆలోచిస్తూ అతన్ని అనుసరించాను.

ఒక్కొక్క పుస్తకం తీసి చూస్తున్నాను. చాలా మంచి పుస్తకాలున్నాయి.

ధర అడిగితే నవ్వి, "తీసుకోండి మేడం" అన్నాడు.

ఆఖరికి వెయ్యకూడదనుకున్న ప్రశ్న వెయ్యకుండా ఉండలేకపోయాను.

"నీకు ఈ పుస్తకాలు ఎలా వస్తాయి? "

✻ "ప్రళయపయోధిజలే ధృతవానసి వేదం, విహిత వహిత్ర చరిత్రమఖేదమ్, కేశవ! ధృత మీన శరీర! జయ జగదీశహరే!" అంటూ ప్రారంభించి జయదేవుడు శ్రీమహావిష్ణువు దశావతారాల రూపాలనూ వర్ణిస్తే అన్ని భాషలవారూ ఆనందించారు, ఆస్వాదించారు. ఇది సంస్కృతభాషలో ఉన్నా ప్రాంతీయభాషా చిత్రాలలో సైతం యథాతథంగా ఉంచి జయదేవకవి కృతులను ప్రజలకు అందించింది చిత్రసీమ. ప్రజలకు వినోదాన్నీ, విజ్ఞానాన్నీ అందించే చిత్ర పరిశ్రమ ఈనాడు ఇంత అభివృద్ధిని సాధించిందీ అంటే అది ఒక్కరివల్ల కాలేదు. ఒక్కనాడే కాలేదు. అనేకమంది కృషితో జరిగింది. అనేక సంవత్సరాలనుండి కృషి జరిగింది. జె.ఎఫ్.మదన్ కలకత్తాలో తొలిసారిగా ఓ సినిమా థియేటర్‌ను 1927లో నిర్మించాడు. ఆ తదనంతరం ఆయన మదన్ థియేటర్స్ లిమిటెడ్ బ్యానర్ కింద 85 థియేటర్లను మన దేశంలోనే గాక మ్యాన్‌మార్, శ్రీలంకలలో కట్టించటంతో అతని పేరు రికార్డ్‌బుక్‌లో నమోదైంది.

బాలయ్య అన్నాడు, "దొంగతనం చేసినవి మాత్రం కాదండీ"

ఛెళ్ళున మొహాన కొట్టినట్టు అనిపించింది. "అది కాదోయ్" అంటూ ఏదో చెప్పబోయాను.

"క్షమించండి మేడమ్. అక్కడ కాలేజీలో జరిగిన సంగతులన్నీ నాకు తెలుసు. మీరందరూ అనుకుంటున్నట్టు నేను ఏడు పుస్తకాలు దొంగతనం చెయ్యలేదు. ఒక్క 'వేయి పడగలు' మాత్రం. అది కూడా నిర్దుష్టంగా చెప్పాలంటే రహస్యంగా లైబ్రరీనించి తెచ్చుకున్నాను కాని దొంగిలించలేదు. ఇతర పుస్తకాలలాగే అది కూడా చదివి మళ్ళీ లైబ్రరీలో పెట్టేసి ఉండేవాణ్ణి. అది కూడా మాలాటి నాలుగో తరగతి ఉద్యోగులకి గత్యంతరం లేదు కనక. నాకు చిన్నప్పట్నుంచి చదవాలనే కాంక్ష. కమలమ్మగారింట్లో పనిచేస్తున్నప్పుడు మా వూరికి కొత్తగా బ్రాంచి లైబ్రరీ వచ్చింది. ఆవిడ చెప్పారు కదా నేను ఉదయం, సాయంత్రం కనిపించేవాడినికానని. లైబ్రరీకి వెళ్లేవాడిని. పనంతా చేసినా, ఇంట్లో కనిపించకపోవడమే నేరంగా వాళ్ళు చిరాకు పడసాగారు. ఆ తరవాత చాలా ఉద్యోగాలు చేశాననుకోండి. మెడికల్ కాలేజీ ఉద్యోగం మాత్రం నేనే మానేశాను. లైబ్రరీలో ఉద్యోగం అయితే చదువుకోవచ్చు అనుకుని"

"కానీ నేను సాగనివ్వలేదు" అన్నాను అందిస్తున్నట్టు.

బాలయ్య సిగ్గుపడ్డాడు. "మీరన్నమాట కూడా నిజమేకదండీ. నన్ను జీతం ఇచ్చి పెట్టుకున్నది నేను చదువుకోడానికి కాదు కదా. పోగా, నేను చదువుకోవాలంటే ఫలానా పుస్తకం ఇప్పించమని ఎవరినయినా అడిగితే, 'నువ్వా, ఇదా, చదువుతావా?' అంటారు"

బాలయ్య వాచ్యం నేను గమనించాను. అతడి తపన తెలుస్తోంది.

అందుకని బాలయ్య ఈ పద్ధతి కనిపెట్టాడు. కాని అది కూడా అట్టే రోజులు సాగలేదు. అందుకని మద్రాసు వచ్చి కష్టపడి, సెకండ్‌హాండ్ పుస్తకాల షాపులో బోయ్‌గా చేరి, క్రమంగా భాగస్థుడై ఆఖరికి సొంత దుకాణం పెట్టుకునే స్థితికి వచ్చాడు. చాలా సంతోషించదగ్గ విషయమే.

"ఇప్పుడు హాయిగా ఎన్నయినా చదువుకోవచ్చు ఎవరూ అడగరు" అన్నాను వెనక్కి తిరగబోతూ.

బాలయ్య నవ్వాడు. "అదేనండీ తమాషా. ఇప్పుడు పుస్తకాలు నాకు వ్యాపారసరుకు మాత్రమే. మిఠాయి దుకాణదారులా చుట్టూ పరుచుకు కూచుంటానంతే. చదివే తీరిక లేదు" అన్నాడు.